క్లుప్తంగా

దరఖాస్తు చేసుకోవాలి

దేవరకొండ : గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఉప ఎన్నికల నేపథ్యంలో అర్హులైన వారు ఫిబ్రవరి 6వ తేదీలోగా ఓటరుగా నమోదు చేసుకోవాలని తహసీల్దార్ సంతోష్‌కిరణ్ సోమవారం ఒక ప్రకటనలో కోరారు. 2020 నవంబర్ నాటికి గ్రాడ్యుయేషన్ పూర్తి చేసి ఉన్న వారు ఫారం 18 ద్వారా సంబంధిత ధ్రువీకరణ పత్రాలను జతచేస్తూ దరఖాస్తు చేసుకోవాలని ఆయన తెలిపారు. సాధారణ ఎన్నికల్లో ఓటరుగా నమోదైన మండలం నుంచి మాత్రమే ఓటు హక్కుకు దరఖాస్తు చేసుకోవాలని ఆయన సూచించారు.

పశువుల సంతకు రేపు వేలం పాట

డిండి : మండల కేంద్రంలో పశువులు, మేకల సంతకు బుధవారం ఉదయం 11గంటలకు పంచాయతీ ఆవరణలో వేలం పాట నిర్వహిస్తున్నట్లు సర్పంచ్ మేకల సాయమ్మ కాశన్న, గ్రామ కార్యదర్శి జంగయ్య సోమవారం ఒక ప్రటకలనలో తెలిపారు. ఈ సందర్భంగా మంగళవారం ఉదయం 9గంటల నుంచి సాయంత్రం 5గంటలకు పంచాయతీ కార్యాలయంలో రూ.5వేలు చెల్లించి రశీదు పొందిన వారు మాత్రమే వేలం పాటలో పాల్గొనడానికి అర్హులవుతారని పేర్కొన్నారు. మిగతా వివరాలకు 8639236434 ఫోన్ నెంబర్‌ను సంప్రదించాలన్నారు.

పాఠశాలల్లో మౌలిక వసతులు కల్పించాలి

మిర్యాలగూడ అర్బన్ : ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక సదుపాయాలు కల్పించాలని ఏఐఎఫ్‌డీసీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లె మురళి అన్నారు. సోమవారం పట్టణంలోని శాంతినికేతన్ డిగ్రీ కళాశాలలో ఏర్పాటు చేసి ఏఎఫ్‌డీసీ జనరల్‌బాడీ సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. సోషల్ వెల్ఫేర్ గురుకుల హాస్టళ్లకు సొంత భవనాలను నిర్మించాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు పోతుగంటి కాశి, వస్కుల భరత్, కిరణ్, శివ, అజయ్, సుజందర్ పాల్గొన్నారు.

కేటీఆర్‌ను కలిసిన మాజీ ఎమ్మెల్యే భగత్

హాలియా : బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్‌ను హైదరాబాద్‌లోని పార్టీ కార్యాలయంలో సోమవారం సాగర్ మాజీ ఎమ్మెల్యే నోముల భగత్, మాజీ ట్రికార్ చైర్మన్ ఇస్లావత్ రాంచందర్‌నాయక్ మర్యాద పూర్వకంగా కలిశారు. ఈనెల 31న సాగర్‌లోని రెడ్డి ఫంక్షన్ హాల్‌లో నిర్వహించే సాగర్ నియోజకవర్గ బీఆర్ఎస్ పార్టీ ముఖ్య కార్యకర్తల సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరు కావాలని ఈ సందర్భంగా కేటీఆర్‌ను ఆహ్వానించినట్లు వారు తెలిపారు. అదే విధంగా జిల్లా కలెక్టర్ హరి చందనను కలెక్టరేట్ కార్యాలయంలో మాజీ ఎమ్మెల్యే నోముల భగత్ మర్యాదపూర్వకంగా కలిశారు. సాగర్ నియోజకవర్గంలో ఉన్న పెండింగ్ పనుల సమస్యను త్వరగా పూర్తి చేయాలని కోరినట్లు భగత్ తెలిపారు.

మట్టిరోడ్డు వేసిన యువకులు



రోడ్డు పనులు ప్రారంభిస్తున్న యువకులు

పెద్దవూర : మండలంలోని నాయినివానికుంట తండాలోని చర్చి రోడ్డు బాగా లేకపోవడంతో రైతులు పడుతున్న ఇబ్బందులను గ్రహించి తండాకు చెందిన యువకులు తమ సొంత ఖర్చులతో మట్టి రోడ్డు వేశారు. నిత్యం వ్యవసాయ పొలాలకు వెళ్తున్న గ్రామస్తులు, రైతులు అనేక ఇబ్బందులు పడుతున్నారు. దీంతో తండాకు చెందిన బీజేపీ, బీఆర్ఎస్ పార్టీలకు చెందిన పలువురు యువకులు ముందుకు వచ్చి తలా కొంత వేసుకుని రూ.30వేలను జమ చేసి సోమవారం జేసీబీ సాయంతో మట్టి రోడ్డు వేయించారు. ఈ కార్యక్రమంలో యువకులు వినోద్‌నాయక్, సీతారాంనాయక్, సుమన్ నాయక్ పాల్గొన్నారు.

డిండిలో గంధోత్సవం

డిండి : మండల కేంద్రంలోని హజ్రత్ షా సాహెబ్ గంధోత్సవం సోమవారం తెల్లవారుజామున ఘనంగా నిర్వహించారు. దర్గా ఆవరణలో ఖత్మేఖురాన్ సందర్భంగా ఏర్పాటు చేసిన ఖవ్వాలీ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా నాగర్‌కర్నూల్ జిల్లా పీఠాధిపతి షాకీర్ పాషా పాల్గొన్నారు. అనంతరం స్వామి వారికి పూలు, దట్టీలు, మాలీదా సమర్పించి భక్తులు తమ మొక్కులను తీర్చుకున్నారు. ఈ కార్యక్రమంలో దర్గా నిర్వాహకులు హన్మంతు కార్యకర్తలు కిషన్, భీమయ్య, మోహినయ్య, హబీబ్, రహీమాన్, షర్ఫోద్దీన్, హమీద్, అయ్యూబ్, శివాజీ, అక్కోజీ పాల్గొన్నారు.

కండక్టర్‌కు డాక్టరేట్

మిర్యాలగూడ టౌన్ : మిర్యాలగూడ ఆర్టీసీ డిపోలో పనిచేస్తున్న ఆర్టీసీ కండక్టర్ ఎం. జార్జి తెలుగు, ఇంగ్లీష్ సాహిత్యంతో పాటు కవితా ప్రక్రియలో కృషి చేసి చేసినందుకు గాను ఏషియన్ ఇంటర్నేషనల్ కల్చరల్ రిసెర్చ్ యూనివర్శిటీ డాక్టరేట్‌ను ప్రకటించింది. ఈ డాక్టరేట్‌ను యూనివర్శిటీ కో ఆర్డినేటర్ లయన్ ఆకుల రమేష్ ద్వారా ఈ పట్టాను పొందాడు. మిర్యాలగూడ డిపోకు చెందిన కండక్టర్ జార్జికి డాక్టరేట్ రావడంపై ఆర్టీసీ డీఎం బొల్లెద్దు పాల్, అసిస్టెంట్ డిపో మేనేజర్ సంధ్యారాణి, ఏఎంఎఫ్ పుప్పాల యాదగిరిలు తోటి కండక్టర్లు అభినందించారు.

సమీకృత మార్కెట్‌కు నిధుల కొరత

- బిల్లుల రాక నిలిచిపోయిన పనులు
- రెండేళ్లుగా రూ.70లక్షలు చెల్లింపు
- పనులు ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్న ప్రజలు



నిర్మాణ దశలో ఉన్న సమీకృత మార్కెట్

మిర్యాలగూడ టౌన్ : మున్సిపాలిటీలో సమీకృత మార్కెట్ నిర్మాణానికి నిధుల కొరత ఏర్పడింది. గత మూడునెలలుగా కాంట్రాక్టర్‌కు బిల్లులు చెల్లించకపోవడంతో పనులు నిలిపివేశారు. మాంసాహారం, కూరగాయాలు, పండ్లు, పూలు అన్ని ఒకే చోట ప్రజలకు దొరికేలా రూ.4.50కోట్లతో సమీకృత మార్కెట్‌ను నిర్మించాలని అప్పటి బీఆర్ఎస్ ప్రభుత్వం నిర్ణయించింది. దీంతో మిర్యాలగూడ మున్సిపాలిటీలోని ఎన్ఎస్పీ క్యాంపులోని మినీ రవీంద్ర భారతీ పక్కన రెండు ఎకరాల భూమిని సమీకృత మార్కెట్ నిర్మాణానికి కేటాయించారు. 2022లో అప్పటి విద్యుత్ శాఖ మంత్రి గుంటకండ్ల జగదీష్‌రెడ్డి, శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి, ఎమ్మెల్యే నలమోతు భాస్కర్‌రావులు ఈ నిర్మాణ పనులకు శంకుస్థాపన చేసిన విషయం తెలిసిందే. ఈ సమీకృత మార్కెట్ నిర్మాణ పనులు జూన్ 2023 నాటి వరకు పూర్తి చేయాలనే లక్ష్యంతో ఆరోగ్యశాఖ అధికారులు ముందుకుసాగారు. కానీ కాంట్రాక్టర్‌కు బిల్లుల చెల్లింపులో జాప్యం జరుగుతుండటంతో మందకొడిగా సాగాయి.

ఆది నుంచి ఆటంకాలే..

ప్రభుత్వం బెస్మెంట్ లెవల్ వరకు కాంట్రాక్టర్ పనులు చేసి కోటి రూపాయాలకు బిల్లులు సమర్పిస్తే ప్రభుత్వం రూ.70లక్షల వరకు మాత్రమే విడుదల చేసింది. దీంతో నిధులు సరిగా విడుదల చేయకపోవడంతో ఒక ఏడాది వరకు పనులు ఆగాయి. తిరిగి బిస్మెంట్ నుంచి మొదటి అంతస్తు వరకు కాంట్రాక్టర్ మరోసారి నిర్మాణ పనులు చేపట్టగా రెండో విడత చేపట్టిన పనులకు రూ.కోటీ 50లక్షలు వరకు పనులు చేశారు. వాటికి సంబంధించి బిల్లు రాకపోవడంతో మరోసారి పనులు పూర్తిగా ఆగిపోయాయి. సమీకృత మార్కెట్‌కు ఆదినుంచి ఆటంకాలు ఎదరవుతున్నాయి. ఈ మార్కెట్‌లో 108 దుకాణాలను నిర్మించాల్సి ఉంది కానీ నిధులు సరిపడా లేకపోవడంతో బెస్మెంట్‌తో పాటు చువ్వలు లేపి వదిలేశారు. అయితే ఈ నిర్మాణ పనులు పూర్తి అయితే వీటిలో 30 దుకాణాలు మాసం, చికెన్, చేపల కోసం కాగా మరో 18దుకాణాలు పూలు, పండ్ల వ్యాపారానికి కేటాయించగా మిగిలిన 60 దుకాణాలు మాత్రం కూరగాయాలు అమ్ముకునేందుకు అవకాశం ఉంటుంది.

ఆధునీకరణకు మరో రూ.6కోట్లు

అధునీకరణగా సమీకృత మార్కెట్‌గా పూర్తి స్థాయిలో పనులు పూర్తి కావాలంటే మరో ఆరు కోట్ల రూపాయల వరకు ఇస్తే మరిన్నీ సౌకర్యాలతో అన్ని హంగులతో మార్కెట్ నిర్మాణం పూర్తయ్యే అవకాశం ఉందని తెలుస్తుంది. అయితే బీఆర్ఎస్ ప్రభుత్వం హాయంలో చేపట్టిన పనులకు కాంగ్రెస్ ప్రభుత్వం చెల్లిస్తుందా..? లేదా అనేది చర్చ సాగుతుంది.

నిధులు మంజూరుకాగానే పనులు చేపడుతాం



సమీకృత మార్కెట్ నిర్మాణ పనులకు మొదటి విడతలో రూ.70లక్షలు మాత్రమే విడుదలయ్యాయి. ఆ నిధులు కేవలం బెస్మెంట్ లెవల్ వరకు పనులు పూర్తి చేశారు. తిరిగి రెండోసారి మొదటి అంతస్తు వరకు పూర్తి చేశారు. చేసిన పనులకు బిల్లులు ప్రభుత్వానికి పంపించడం జరిగింది. ఈ నిధులు మంజూరు కాగానే పనులను ప్రారంభిస్తారు. ఈ మార్కెట్ నిర్మాణ పనులను పూర్తి చేసేందుకు ప్రత్యేక చర్యలను చేపడతాం.

– బి. వెన్నెల కుమార్
పబ్లిక్ హెల్త్ ఏఈ, మిర్యాలగూడ

ఆదర్శ మున్సిపాలిటీగా తీర్చిదిద్దుతాం



మున్సిపల్ సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే బాలునాయక్

దేవరకొండ : దేవరకొండ మున్సిపాలిటీని ఆదర్శ మున్సిపాలిటీగా తీర్చిదిద్దేందుకు ప్రణాళికాబద్ధంగా చర్యలు చేపట్టనున్నట్లు ఎమ్మెల్యే బాలునాయక్ అన్నారు. సోమవారం మున్సిపల్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సాధారణ సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. మున్సిపల్ అధికారులు, పాలకవర్గం సమన్వయంతో మున్సిపాలిటీ అభివృద్ధికి కృషి చేయాలన్నారు.త్వరలోనే వార్డుల వారిగా పర్యటించి సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటానన్నారు. రానున్న వేసవిని దృష్టిలో ఉంచుకొని పట్టణంలో తాగునీటి ఎద్దడి తలెత్తకుండా అవసరమైన చర్యలు తీసుకోవాలని ఆయన మున్సిపల్ అధికారులకు సూచించారు. పట్టణంలో ఆధార్ కేంద్రాలు తక్కువగా ఉండడం వలన ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పలువురు కౌన్సిలర్లు సమావేశం దృష్టికి తీసుకురావడంతో ఆధార్ కేంద్రాలను పెంచే విధంగా చర్యలు తీసుకోవాలని ఆయన స్థానిక తహసీల్దార్ సంతోష్ కిరణ్‌ను ఆదేశించారు. అనంతరం కౌన్సిలర్లు ఎమ్మెల్యేను ఘనంగా సన్మానించారు. ఈ సమావేశంలో మున్సిపల్ చైర్మన్ ఆలంపల్లి నర్సింహ్మ, వైస్ చైర్మన్ రహత్‌అలీ, కమిషనర్ వెంకటయ్య, కౌన్సిలర్లు తదితరులు పాల్గొన్నారు.

నియోజకవర్గ అభివృద్ధికి కృషి

పెద్దఅడిశర్లపల్లి : నియోజకవర్గ అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని దేవరకొండ ఎమ్మెల్యే నేనావత్ బాలునాయక్ అన్నారు. సోమవారం మండల కంద్రంతో పాటు దుగ్యాల, అజ్మాపురం, ఘనిపల్లి గ్రామాల్లో గ్రామపంచాయతీ భవనాలను ప్రారంభించి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో జిల్లా పరిషత్ ఫ్లోర్ లీడర్ అలుగుబెల్లి శోభారాణిఏవిరెడ్డి, ఎంపీపీ వంగాల ప్రతాపరెడ్డి, సర్పంచ్‌లు గొర్ల ఐదమ్మ ,శైదమ్మ శ్రీనివాస్, ఆదిరాల నగేష్, అంజిరెడ్డి, ఎంపీటీసీలు పిల్లి సత్యశ్రీ యాదగిరి, మధుసూధన్‌రెడ్డి పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల కృషి అభినందనీయం



సబ్జెక్టు మెటీరియల్‌ను ఆవిష్కరిస్తున్న ఎంఈఓ

త్రిపురారం : ప్రభుత్వ పాఠశాల్లో చదివే విద్యార్థులు అంగ్లభాషపై పట్టు సాధించాలనే లక్ష్యంతో ఉపాధ్యాయులు చేస్తున్న కృషి అభినందనీయమని ఎంఈఓ బాలాజీ నాయక్ అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఇంగ్లీష్ టీచర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆ టీచర్లతో కలిసి స్పెల్ విజార్డ్ కాంపిటేషన్ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఇంగ్లీష్ టీచర్లు తయారు చేసిని సబ్జెక్ట్ మెటీరియల్‌ను విడుదల చేసి మాట్లాడారు. స్పెల్ విజార్డ్ కాంపిటేషన్‌లో ఆంగ్ల అక్షరాల కూర్పుతో పాటుగా ఆగ్లంలో కథలు అల్లడం సన్నివేశాల గురించి వర్ణించడంపై విద్యార్థులకు అవగాహన కల్పించి మండలస్థాయిలో ప్రతిభ కనబర్చిన విద్యార్థిని జిల్లా స్థాయి పోటీలకు ఎంపిక చేస్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఇంచార్జ్ ప్రధానోపాధ్యాయురాలు దుర్గా రాణి, ఇంగ్లీష్ ఉపాధ్యాయుల అసోసియేషన్ మండల కన్వినర్ వీరపెల్లి శ్రీనివాస్, మాల్లా రెడ్డి, జాకీర్ హుస్సేన్, శ్రీనయ్య, దశరథ పాల్గొన్నారు.

అన్ని ఉద్యోగాలను ఒకేసారి భర్తీ చేయాలి

మిర్యాలగూడ : రాష్ట్రంలో ఖాళీగా ఉన్న ఉద్యోగాలన్నింటిని రాష్ట్ర ప్రభుత్వం ఒకేసారి భర్తీ చేయాలని ఏఐఎఫ్‌డీవై జిల్లా అధ్యక్షుడు వస్కుల కిరణ్ అన్నారు. సోమవారం పట్టణంలోని ఆర్డీఓ కార్యాలయంలో వినతిపత్రం అందజేసి ఆయన మాట్లాడారు. నిరుద్యోగులకు కనీస భృతి రూ.5వేలు అందించాలని, రిటైర్డ్ అయిన ఉద్యోగుల స్థానంలో నిరంతర భర్తీకి పబ్లిక్ ఎంప్లాయిమెంట్ చట్టం తేవాలన్నారు. ఈ కార్యక్రమంలో వస్కుల గోపి, నవీన్, వెంకన్న, శ్రీను, శ్రీను, ప్రశాంతి తదితరులు పాల్గొన్నారు.

పౌష్టికాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం



చిన్నారికి అన్నప్రాసన చేస్తున్న సర్పంచ్

తిరుమలగిరి(నాగార్జునసాగర్): పౌష్టికాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యాన్ని పొందవచ్చని తిరుమలగిరి సర్పంచ్ శాగం శ్రవణ్‌కుమార్‌రెడ్డి అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని అంగన్‌వాడీ కేంద్రం 3లో నిర్వహించిన సామూహిక సీమంతాలు, అన్నప్రాసన, అక్షరాభ్యాసం కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. మహిళలు, గర్భిణులు రక్తహీనతతో బాధపడకుండా ఉండేందుకు ప్రభుత్వం అంగన్‌వాడీ కేంద్రాలకు రుచికరమైన పౌష్టికాహారాన్ని అందిస్తున్నట్లు ఆయన తెలిపారు. ప్రభుత్వం అందిస్తున్న పౌష్టికాహారాన్ని ప్రతి ఒక్కరు సద్వినియోగించుకోవాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్ కళావతి, మహిళలు స్వేత, అరుణ, పద్మావతి తదితరులు పాల్గొన్నారు.

బాల్య వివాహాలు చట్టరీత్యా నేరం

చింతపల్లి : బాల్య వివాహాలు చట్టరీత్యా నేరమని సీడీపీఓ లావణ్యకుమారి తెలిపారు. సోమవారం మండలంలోని గడియగౌరారం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బాల్య వివాహాలపై బేటీ బచావో – బేటీ పడావో బాలికల సంరక్షణ గురించి విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జాతీయ బాలికా దినోత్సవం సందర్భంగా మండలంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు బాల్య వివాహాలపై అవగాహన కల్పిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎం జంగయ్య, సూపర్‌వైజర్ అంజమ్మ, అంగన్‌వాడి టీచర్ లక్ష్మి, వెంకటమ్మ, వీణ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వేతనాలు చెల్లించాలని కలెక్టర్‌కు వినతి



కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న అకడమిక్ ఇన్‌స్ట్రక్టర్లు

పెద్దవూర : ప్రభుత్వ గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలల్లో బోధిస్తున్న అకడమిక్ ఇన్‌స్ట్రక్టర్ ఉపాధ్యాయులకు తగ్గించి ఇచ్చిన వేతనాలను తిరిగి చెల్లించాలని సోమవారం గ్రీవెన్స్ డే సందర్భంగా కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తొమ్మిదేళ్లుగా ప్రభుత్వ గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలల్లో రూ.12వేల గౌరవ వేతనంతో పనిచేస్తున్నట్లు తెలిపారు. ఈ ఏడాది నుంచి థర్డ్ పార్టీ ఔట్‌సోర్సింగ్ ఏజెన్సీకి అప్పగించి తమకిచ్చే రూ.12వేల వేతనం నుంచి ఈఎస్ఐ, పీఎఫ్, 18శాతం జీఎస్టీ, 6శాతం ఏజెన్సీ కమిషన్ అంటూ మొత్తం 40శాతం వేతనం నుంచి కటింగ్ చేసి కేవలం రూ.7373ల వేతనం మాత్రమే చెల్లించారని ఆవేదన వ్యక్తం చేశారు. వేతనాలు పెంచేదిపోయి తగ్గించటమేంటని, అందులో తమకిచ్చే రూ.12వేలలో 18శాతం జీఎస్టీ విధించటం ఏంటని వాపోయారు. థర్డ్ పార్టీ ఏజెన్సీని రద్దు చేసి, సీఆర్‌టీలతో సమానంగా వేతనాన్ని ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో అకాడమిక్ ఇన్‌స్ట్రక్టర్ ఉపాధ్యాయులు ఎండీ.షబ్బీర్, రమేష్, కృష్ణ, రాంరెడ్డి, అలివేలు, రామకృష్ణ, చందర్, వీణ, శ్రావణి, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి ఎద్దడి నివారణకు చర్యలు తీసుకోవాలి

- కలెక్టర్‌ను కోరిన ఎమ్మెల్యే జైవీర్‌రెడ్డి



కలెక్టర్ హరిచందనతో మాట్లాడుతున్న ఎమ్మెల్యేలు జైవీర్‌రెడ్డి, బీఎల్ఆర్

నాగార్జునసాగర్ : వేసవిలో నియోజక వర్గం పరిధిలోని గ్రామాలు, తండాల్లో తాగునీటి ఎద్దడి నివారణకు ముందుస్తుగా చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే జైవీర్‌రెడ్డి కలెక్టర్ హరిచందనను కోరారు.సామవారం నల్లగొండలో కలెక్టర్‌ను కలిసి పై సమస్యపై మాట్లాడారు. ఈ ఏడాది వర్షాలేకపోవడంతో సాగర్ జలాశయంతో పాటు చెరువులు, కుంటల్లో నీరు లేకుండా పోయాయని ఇప్పటికే భూగర్భ జలాలు అడుగంటడం మొదలైనట్లు వివరించారు. మిషన్‌భగీరథ పథకం కింద నేటికీ చాలా గ్రామాల్లో తాగునీరు అందని పరిస్థితులు ఉన్నాయని తెలిపారు. చాలాచోట్ల పైపులైన్లు వేయాల్సి ఉందని, గ్రామాల్లో కూడా నూతనంగా ఏర్పాటైన కాలనీలకు తాగునీటి పైపులు వేయలేదని, బోర్లు వేయాల్సిన పరిస్థితి వచ్చే అవకాశాలు ఉన్నాయని పేర్కొన్నారు.

అన్ని వర్గాల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం



పంచాయతీ కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే జైవీర్‌రెడ్డి, ఎమ్మెల్సీ కోటిరెడ్డి

పెద్దవూర : అన్ని వర్గాల సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ ధ్యేయమని నాగార్జునసాగర్ ఎమ్మెల్యే కుందూరు జైవీర్‌రెడ్డి అన్నారు. మండలంలోని బసిరెడ్డిపల్లి గ్రామంలో రూ.20 లక్షలతో నిర్మించిన నూతన గ్రామ పంచాయతీ కార్యాలయాన్ని ప్రారంభించి మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజల ప్రభుత్వమని, రాజకీయాలకు అతీతంగా ప్రజాసమస్యల పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. ఎమ్మెల్సీ ఎంసీ కోటిరెడ్డి మాట్లాడుతూ గ్రామాల అభివృద్ధిలో పార్టీలకు అతీతంగా ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. అనంతరం గ్రామ సర్పంచ్ నరాల కొండయ్యను సర్పంచ్ కుర్చీలో కూర్చొబెట్టి సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ చెన్ను అనురాధసుందర్‌రెడ్డి, జెడ్పీటీసీ అబ్బిడి కృష్ణారెడ్డి, జెడ్పీ వైస్ చైర్మన్ ఇరిగి పెద్దులు, మాజీ జెడ్పీ వైస్ చైర్మన్ కర్నాటి లింగారెడ్డి, వైస్ ఎంపీపీ గోన వివేకరావు, మాజీ ఎంపీపీ రమావత్ శంకర్ నాయక్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు తుమ్మలపల్లి చంద్రశేఖర్‌రెడ్డి, ఎంపీడీఓ లక్ష్మీ, ఎంపీవో విజయకుమారి, ఉప సర్పంచ్ అంజయ్య, కార్యదర్శి శ్యాం సుందర్‌రెడ్డి, నాయకులు నరేందర్ పాల్గొన్నారు.

ప్రతీ కార్యకర్తకు సముచిత స్థానం

తిరుమలగిరి(నాగార్జునసాగర్) : పార్టీకి కార్యకర్తలే వెన్నుముక అని, ప్రతీ కార్యకర్తలకు పార్టీలో సముచిత స్థానం ఉంటుందని ఎమ్మెల్యే కుందూరు జైవీర్ రెడ్డి అన్నారు. మండలంలోని నాగార్జునపేటతండాకు చెందిన పలువురు బీఆర్ఎస్ నాయకులు సోమవారం నాగార్జునసాగర్‌లోని ఎమ్మెల్యే జైవీర్ రెడ్డి నివాసంలో కాంగ్రెస్‌లో చేరారు. వారికి ఎమ్మెల్యే పార్టీ కండువకప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భగా ఆయన మాట్లాడుతూ పార్టీలో కొత్త, పాత అనే తారతమ్య బేధాలు కేండా పార్టీ బలోపేతానికి సైనికుడిగా పనిచేయాలని ఆయన సూచించారు. ప్రజా సంక్షేమమే ధ్యేయంగా ప్రభుత్వం పనిచేస్తుందన్నారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

విగ్రహాల ఏర్పాటుకు భూమి పూజ



భూమి పూజ చేస్తున్న నాయకులు

కొండమల్లేపల్లి : మండల పరిధిలోని చిన్నఅడిశర్లపల్లి గ్రామంలో సర్దార్ సర్వాయి పాపన్నగౌడ్, బొమ్మగాని ధర్మభిక్షంగౌడ్ విగ్రహాల ఏర్పాటుకు సోమవారం గౌడ సంఘం ఆధ్వర్యంలో భూమి పూజ నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ జమిందారి వ్యవస్థకు వ్యతిరేకంగా వారు చేసిన పోరాటాలను, త్యాగాలను గుర్తు చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ గౌడ గీత సంఘాల సమన్వయ కమిటీల్లా చైర్మన్ డాక్టర్ చింతపల్లి శ్రీనివాసగౌడ్, ఎంపీపీ రేఖశ్రీధర్‌రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ డాక్టర్ వేణుధర్‌రెడ్డి, కడారి అంజయ్యయాదవ్, మేకల శ్రీనివాస్‌యాదవ్, దస్రూనాయక్, ఎస్ఐ వీరబాబు, సర్పంచ్ గడ్డం శ్రీరాములు, సర్పంచ్ కుంభం శ్రీనివాస్‌గౌడ్, ఇంద్రకంటి ఈదయ్య, కుంభం బాలచందర్‌గౌడ్, ఇమ్మడి అంజయ్య, గాదగోని వెంకన్న, పదుల వెంకటయ్య, చిన్న మారయ్య, అంజయ్య, వెంకన్న, వెంకటయ్య, చిన మారయ్య, బొడిగె శంకర్‌గౌడ్, బొడిగె రమేష్ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ భూమిలో ప్లాటు విక్రయిస్తే చర్యలు

కొండమల్లేపల్లి : మండల కేంద్రంలోని సర్వే నంబర్ 154లో ప్లాట్లు చేసి విక్రయిస్తే చర్యలు తప్పవని తహసీల్దార్ శంషొద్దీన్ హెచ్చరించారు. సోమవారం ప్లాట్లు విక్రయించిన ఒక వ్యక్తి సదరు సర్వే నంబర్‌లో బోరు వేయగా బోరును సీజ్ చేసినట్లు తెలిపారు. మండల కేంద్రంలోని సర్వే నెం.154లో 98 ఎకరాల లావణ్య పట్టా భూమి డిండి ఎత్తిపోతల పథకంలో భాగంగా భూములు, ఇళ్లు కోల్పోయిన రైతులకు పునరావాసం కింద కేటాయించినట్లు పేర్కొన్నారు. మండల కేంద్రంలోని హైదరాబాద్ రహదారికి ఆనుకొని ఉన్న ఈ సర్వే నంబర్ భూములకు లక్షల్లో విలువ ఉండడంతో కొంతమంది రైతులు ప్రభుత్వ నిబంధనలు తుంగలో తొక్కి అమాయక ప్రజలకు అంటగడుతున్నారన్నారు. ఈ భూముల్లో ప్లాట్లు విక్రయించి ప్రజలు మోసపోవద్దని, ప్లాట్లు విక్రయించిన వారిపై చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు. ఆయన వెంట ఆర్ఐ యాదయ్యతో పాటు సిబ్బంది ఉన్నారు.

మిర్యాలగూడ రూరల్ సీఐ బాధ్యతల స్వీకరణ



బాధ్యతలు స్వీకరిస్తున్న సీఐ

మిర్యాలగూడ టౌన్ : మిర్యాలగూడ రూరల్ సీఐగా కట్టెకోల వీరబాబు సోమవారం బాధ్యతలను స్వీకరించారు. ప్రస్తుతం ఇక్కడ పని చేస్తున్న సీఐ ముత్తినేని సత్యనారాయణను హైదరాబాద్ ఐజీ కార్యాలయానికి బదిలీ చేశారు. ప్రస్తుతం సూర్యాపేట ఇంటలిజెన్స్ సీఐగా పనిచేస్తున్న కట్టెకోల వీరబాబును మిర్యాలగూడ రూరల్‌కు బదిలీ చేశారు. ఈ సందర్భంగా సోమవారం ఆయన బాధ్యతలను స్వీకరించి మాట్లాడారు. ముందుగా బదిలీపై వెళ్తున్న ముత్తినేని సత్యనారాయణ బాధ్యతలను వీరబాబుకు అప్పగించారు. ఈ సందర్భంగా నూతనంగా బాధ్యతలను స్వీకరించిన సీఐ వీరబాబుకు రూరల్ ఎస్ఐ సతీష్‌వర్మ, ఏఎస్ఐ ఉమాపతిరావుతో పాటు సిబ్బంది కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు.

విద్యార్థులు కష్టపడి చదవాలి



గాంధీ విగ్రహానికి పాలాభిషేకం చేసి నివాళులర్పిస్తున్న విద్యార్థులు

పెద్దఅడిశర్లపల్లి : విద్యార్థులు కష్టపడి చదివి ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని పెద్దఅడిశర్లపల్లి జెడ్పీటీసీ, జిల్లా పరిషత్ కాంగ్రెస్ ఫ్లోర్ లీడర్ అలుగుబెల్లి శోభారాణిఏవిరెడ్డి అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని శ్రీ సాయి కృష్ణవేణి పాఠశాలలో నిర్వహించిన స్వపరిపాలన దినోత్సవ వేడుకలకు ఆమె ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. స్వపరిపాలన దినోత్సవంలో విద్యార్థులు ఉపాధ్యాయులుగా, రాజకీయ నేతలుగా, అధికారులుగా వ్యవహరించారు. అనంతరం ర్యాలీగా బయలుదేరి గాంధీ విగ్రహానికి పాలాభిషేకం చేసి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ తరి రాము, ఎంపీటీసీ పిల్లి సత్యశ్రీయాదగిరి, ఉప సర్పంచ్ సుప్రితాశ్రీనివాస్‌రెడ్డి, పాఠశాల కరెస్పాండెంట్ చంద్రారెడ్డి, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదిదరులున్నారు.

మున్నూరు కాపు కార్పొరేషన్ ఏర్పాటు చేయాలి



ఎమ్మెల్యేకు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

మిర్యాలగూడ : మున్నురుకాపులకు ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని కోరుతూ ఆ సంఘం నాయకులు ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డిని సోమవారం కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సంఘం నియోజకవర్గ ఇన్‌చార్ పందిరి వేణు మాట్లాడుతూ పేద మున్నూరుకాపు ప్రజలకు ప్రభుత్వం ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేసి వారిని అన్ని విధాలుగా ఆదుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో నేతి వెంకటేశ్వర్లు, మేకల శ్రీనివాస్‌రావు, కంచి సత్యనారాయణ, గంధం రామకృష్ణ, లక్ష్మీనారాయణ, మోహన్, రాములు, బిఎం.నాయుడు, సుబ్బారావు, బచ్చలకూరి శ్రీనివాస్ పాల్గొన్నారు.

కొండమల్లేపల్లి : మున్నూరుకాపు సంఘం నుంచి జనాభా ప్రాతిపదికన ప్రత్యేక ఫైనాన్స్ కార్పొరేషన్‌ను ఏర్పాటు చేయాలని కోరుతూ మున్నూరు కాపు సంఘం ఆధ్వర్యంలో సోమవారం దేవరకొండ ఎమ్మెల్యే రమావత్ రవీంద్రకుమార్‌కు వినతిపత్రం అందజేశారు. అంతకుముందు ఎమ్మెల్యే సంఘం ఆధ్వర్యంలో సన్మానించారు. కార్యక్రమంలో జగదీశ్, సుధాకర్, వసత్, యుగంధర్ పాల్గొన్నారు.

రక్తహీనత మందుల పంపిణీ

మిర్యాలగూడ : మండలంలోని అవంతీపురం తెలంగాణ గురుకుల బాలుర ఉన్నత పాఠశాలలోని విద్యార్థులకు సోమవారం వైద్యులు పరీక్షలు నిర్వహించి రక్తహీనత మందులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మెడికల్ ఆఫీసర్ కేస రవి, డాక్టర్ ఎస్.శైలజలు మాట్లాడుతూ కౌమార దశలో బాలబాలికల్లో రక్తహీనతను అరికట్టేందుకుగాను రాష్ట్ర ప్రభుత్వం 'ఎనిమియా ముక్త్ భారత్' కార్యక్రమానికి శ్రీకారం చుట్టిందన్నారు. గ్రామీణ ప్రాంతంలో మొత్తం 2640 మందికి రక్త పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి ఉచితంగా మందులు పంపిణీ చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఫార్మాసిస్ట్ శైలజ, ప్రిన్సిపాల్ కె.సుధాకర్, ఏఎన్ఎం అంజమ్మ, ఆశా కార్యకర్త ఆదిలక్ష్మీ, సిబ్బంది పాల్గొన్నారు.

జాతీయ స్థాయి కరాటే పోటీల్లో విద్యార్థుల ప్రతిభ

మిర్యాలగూడ టౌన్ : ఈనెల 28వ తేదిన హైదరాబాద్‌లో జరిగిన మూడో జాతీయ స్థాయి కరాటే పోటీల్లో హౌసింగ్‌బోర్డుకు చెందిన శాస్త్ర స్కూల్ విద్యార్థులు ప్రతిభను చాటారు. సోమవారం జాతీయ స్థాయిలో ప్రతిభ కనబరిచిన విద్యార్థులను పాఠశాల చైర్మన్ శేఖర్, కరస్పాండెంట్ పాశం శ్రీధర్‌రెడ్డిలు ప్రత్యేకంగా అభినందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి ఒక్కరిలో పట్టుదల కృషి ఉంటే అనుకున్న లక్ష్యాన్ని చేరుకోగలుగుతామన్నారు. జాతీయ స్థాయి పోటీల్లో ఆరో తరగతి చదువుతున్న అనిషా అండర్–12 కటాస్ విభాగంలో సిల్వర్ మెడల్‌తో ద్వితీయ స్థానం సాధించగా, 5వ తరగతి చదువుతున్న పర్మిత అండర్–12 కటాస్ విభాగంలో తృతీయ స్థానంలో రజత పతకాన్ని సాధించారు. అదే విధంగా 5వ తరగతి చదువుతున్న అనందరూప అండర్–11 కటాస్ విభాగంలో ప్రథమ స్థానంలో నిలిచి బంగారు పతకాన్ని సాధించింది.



విద్యార్థులను అభినందిస్తున్న స్కూల్ చైర్మన్

క్యాలెండర్ ఆవిష్కరణ



క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న ఎస్పీ చందనా దీప్తి

మిర్యాలగూడ : బీసీ విద్యార్థి సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ పగిడి జీడయ్యయాదవ్, సంఘం జిల్లా అధ్యక్షుడు అయితగోని జనార్దన్‌గౌడ్‌లు రూపొందించిన బీసీ సంఘం క్యాలెండర్‌ను జిల్లా ఎస్పీ చందనా దీప్తి, డీసీసీ అధ్యక్షుడు కెతావత్ శంకర్‌నాయక్‌లు సోమవారం ఆవిష్కరించారు. ప్రజల రక్షణ కోసం తాను ఎల్లవేళలా అందుబాటులో ఉంటానని అన్నారు. ఈ కార్యక్రమంలో పోలగాని వెంకటేష్‌గౌడ్, గాజుల శ్రీనివాస్, కారింగుల నరేష్, కొంపెల్లి రామన్నగౌడ్, వినోద్ పాల్గొన్నారు.

ఘనంగా పూర్వ విద్యార్థుల సమ్మేళనం



సమ్మేళనంలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు

గుర్రంపోడు : మండలంలోని కొప్పోలు జెడ్పీ ఉన్నత పఠశాల 1992–2000 పదో బ్యాచ్‌కు చెదిన పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనాన్ని సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పాఠశాల స్థాయి స్నేహబంధం బలమైనదని, ఒకరికొకరు అండగా ఉండాలన్నారు. ఆనాటి గురువులను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు ప్రవీణ్, హరిబాబు, శేఖర్, దయానంద్, విజయ్, రాధా, శ్రీదేవి, వెంకటయ్య, రమేష్, పాల్గొన్నారు.